క్లుప్తంగా

చురుగ్గా రైల్వే పనులు



సాలూరు స్టేషన్‌కు వచ్చిన గూడ్స్

సాలూరు: సాలూరు నుంచి విశాఖపట్నం వెళ్లేందుకు రైలు సౌకర్యం అందుబాటులోకి తీసుకురానున్నట్లు రైల్వేశాఖ ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో పట్టణంలో రైల్వేస్టేషన్ ట్రాక్ సరిచేసే పనులు చురుగ్గా జరుగుతున్నాయి. రైలు ఇంజిన్ రివర్స్ చేయడానికి అనుకూలంగా ట్రాక్‌ను ఇటీవల తయారుచేశారు. ఈ క్రమంలో బుధవారం గూడ్స్‌రైలులో అధికారులు, సిబ్బంది వచ్చి ట్రాక్ పనులు పరిశీలించారు. ట్రాక్ పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు పూర్తిచేసి, త్వరలో సాలూరు–విశాఖపట్నం రైలు సౌకర్యం ప్రారంభించనున్నామని రైల్వే అధికారులు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- తహసీల్దార్ ఎం.రాజశేఖర్



హెచ్చరిక బోర్డు ఉన్నప్పటికీ నిర్మిస్తున్న భవనం

పాచిపెంట: అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలని కోరుతూ ఇటీవల అక్రమ నిర్మాణాలు జరుగుతున్న భవనాల వద్ద తహసీల్దార్ కార్యాలయం పేరిట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే హెచ్చరిక బోర్డులు ఉన్నప్పటికీ నిర్మాణాలు చేస్తున్న వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తహసీల్దార్ ఎం.రాజశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు ప్రపంచ రేబిస్ డే



డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: ప్రపంచ రేబిస్ డేను గురువారం నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు తెలిపారు. రేబిస్ ఆల్‌ఫర్ వన్–వన్‌ఫర్ ఆల్ శీర్షికన కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్యకేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రుల్లో రేబిస్ వ్యాధి గురించి అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

ఇంటింటా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



కోన గ్రామంలో వృద్ధురాలికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మక్కువ: మండలంలోని ఎస్.పెద్దవలస, కోన గ్రామ సచివాలయాల పరిధిలోని అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది, వలంటీర్లు బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఇంటింటికి వెళ్లి జ్వరాలతోను, ఇతరత్రా రోగాలతో బాధపడుతున్నారా అన్న విషయాలను తెలుసుకున్నారు. రోగాలతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు చేసి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు.

లక్ష్మీపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



లక్ష్మీపురంలో సర్వేను పరిశీలిస్తున్న సచివాలయ కన్వీనర్ సురేష్‌కుమార్

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో వైద్యాధికారి రాధాకాంత్ ఆధ్వర్యంలో ఆరోగ్య శాఖ సిబ్బంది జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆవాలవలస, లక్ష్మీపురం, ఏగోటివలస గ్రామాల్లో వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్తూ ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. ఈ క్రమంలో లక్ష్మీపురంలో వైద్య సిబ్బంది చేస్తున్న ఆరోగ్య పరీక్షలను సచివాలయ కన్వీనరు సీహెచ్ సురేష్‌కుమార్ పరిశీలించారు.

పురుగుమందులతో జాగ్రత్త

- అప్రమత్తం అవసరం
- వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



చిలకలపల్లిలో సాగు చేస్తున్న పంట

బలిజిపేట: పంటకు వివిధ రకాల చీడపీడలు, తెగుళ్లు ఆశించి రైతులను నష్టపరుస్తున్నాయి. వీటి వల్ల దిగుబడి తగ్గిపోవడమే కాకుండా రైతులకు ఆర్థిక నష్టాలు తప్పడం లేదు. ప్రతి సీజన్‌లో రైతులు పైరుపై రకరకాల పురుగు మందులను వినియోగిస్తుంటారు. ఎప్పుడూ చేసే పనేకదా, నిత్యం వాడే మందులే అంటూ వాటి వినియోగంపై నిర్లక్ష్యం చూపుతూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే వాటిబారి నుంచి రక్షణపొందవచ్చు. దీనికి సూచనలు పాటించాలని బలిజిపేట మండల వ్యవసాయ అధికారి శ్రావణ్ కుమార్ తెలియజేస్తున్నారు.

అవసరమైతే వాడాలి

పైరుపై సీజనల్‌గా ఏదో ఒక చీడపీడ సోకుతుంటుంది. ఒకటి రెండు పురుగులు కనిపించగానే పురుగుమందులు వాడేస్తున్నారు. ఇలా చేయడం వల్ల పైరుకు మేలు చేసే మిత్ర పురుగులు చనిపోతాయి. పైరుకు నష్టం చేసే పురుగులు ఎక్కువగా ఉన్నప్పుడు మాత్రమే మందుల వినియోగం ఉండాలి.

మందుల ఎంపికలో జాగ్రత్తలు అవసరం

పంటపై చీడపీడలను సమూలంగా నివారిస్తాయంటూ రకరకాల మందుల కంపెనీలు చేస్తున్న ప్రచారంతో రైతులు మోసపోతున్నారు. వాటిని వినియోగించడంతో ఫలితం కనిపించకపోగా వ్యయం ఎక్కువవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో దుకాణదారులు ఇచ్చే మందులను వినియోగించడం పరిపాటిగా మారింది. వ్యవసాయశాఖ సూచనల మేర మందుల వినియోగం ఉండాలి.

మోతాదు మేరకే..

వ్యవసాయాధికారుల సూచనల మేరకు తెగులుకు సరైన మందులు సరిపడా మోతాదులో వినియోగించాలి. తక్కువ మందు వాడితే అది పనిచేయక పురుగులు చావవు. ఎక్కువ మందు వాడితే పంటకు నష్టం కలిగించడంతో పాటు అధిక వ్యయం అవుతుంది. పురుగులకు రోగ నిరోధకశక్తి పెరిగి, తెగుళ్ల వ్యాప్తి ఉధృతమవుతుంది. పైరుపై మళ్లీ మళ్లీ పురుగుమందులను పిచికారీ చేయడం మంచిదికాదు.

జాగ్రత్తలు తీసుకోవాలి:

క్రిమిసంహారక మందులు గుర్తింపు పొందిన కంపెనీలవే వినియోగించాలి. మందు సీసాలు, డబ్బాల మూతలను నోటితో తీయకూడదు. మందు ద్రావణాన్ని డ్రమ్ములో కానీ, బకెట్లలో కానీ కలిపిన తర్వాత స్ప్రేయర్లలో నింపుకోవాలి. మందు కొలవడానికి ఔన్సు గ్లాసునే వాడాలి. మందు కలిపేటప్పుడు చేతులకు గ్లౌజులు, రక్షణ దుస్తులు ధరించాలి. ఆరోగ్యం సరిగా లేని వారు మందులు పిచికారీ చేయరాదు. కళ్లజోడు ధరించడం ఉత్తమం. అనుకోకుండా మందు తుంపరలు కంటిలో పడితే వెంటనే కళ్లను చల్లని నీళ్లతో బాగా కడిగి వైద్యుని సంప్రదించాలి. శరీరంపై గాయాలు, కురుపులు ఉన్నవారు పురుగుమందులు పిచికారీ చేయరాదు. గాలికి వాలుగా పిచికారీ చేయాలి. పని పూర్తయ్యాక రెండుమూడు సార్లు సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని ఏఓ శ్రావణ్ కుమార్ వివరించారు.

నాణ్యతా ప్రమాణాలకు లోబడి దాణా విక్రయాలు



దాణా శాంపిల్స్ తీస్తున్న పశుసంవర్థక శాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్

సీతానగరం: కల్తీలేని, నాణ్యత ప్రమాణాలకు లోబడిన దాణాను లైసెన్స్‌డ్ డీలర్లు విక్రయించి, పాడి పశువులనుంచి పోషక విలువలతో కూడిన పాల ఉత్పత్తికి దోహద పడాలని పశుసంవర్థక సీతానగరం సబ్ డివిజన్ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం సీతానగరం, బలిజిపేట మండలాల్లో దాణా విక్రయ కేంద్రాలలో దాణా నిల్వలను, సరుకును ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పాడి వినియోగదారులకు స్వచ్ఛమైన పాలు సమకూర్చడానికి అవసరమైన చర్యలు తీసుకుందన్నారు. ఈ నేపథ్యంలో బలిజిపేట మండలంలో బలిజిపేట, వెంగాపురం, సీతానగరంలోని సువర్ణకల్కి ట్రేడర్స్, మనగ్రోమోర్, మరిపివలసలో 2, అంటిపేట గ్రామంలో లైసెన్స్‌డ్ దాణా విక్రయ కేంద్రాలున్నాయని తెలియజేశారు. దాణా విక్రయదారులు ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీలు తయారు చేస్తున్న నాణ్యమైన దాణా విక్రయించాలని తద్వారా దాణావినియోగించే పాడి పశువులు నుంచి వచ్చే పాలు ఆరోగ్యకరమైనవిగా ఉంటాయన్నారు. డిపోల్లో విక్రయిస్తున్న దాణా బస్తాల నుంచి అరకేజీ వంతున శాంపిల్స్ తీసి వాటిలో ఉన్న పోషక విలువలను కనుగొనేందుకు ల్యాబ్‌లకు పంపించనున్నట్లు తెలిపారు.

దాణా బస్తాల్లో ఎటువంటి లోపాలున్నా నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పదిహేను రోజుల కోసారి దాణా విక్రయకేంద్రాలను విధిగా తనిఖీ చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయడంతో తనిఖీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో కల్కిట్రేడర్స్ నిర్వాహకుడు ఏవీ సత్యనారాయణ, పశువైద్య సిబ్బంది, రైతుభరోసా వెటర్నరీ సహాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సర్వే



పెదపెంకిలో ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్న సిబ్బంది

బలిజిపేట: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే గ్రామాల్లో జోరుగా సాగుతోంది. అందులో భాగంగా మండలంలోని పెదపెంకిలో వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి నిర్వహిస్తున్న సర్వేను ఎంపీపీ జి.నాగమణి పర్యవేక్షించారు. ఇంటింటికీ వెళ్లి ఎవరికి ఎటువంటి సమస్యలు ఉన్నాయో గుర్తించి పరిష్కరించేదిశగా చూడాలని వైద్యసిబ్బందిని కోరారు. ఈనెల 30నుంచి నిర్వహించనున్న క్యాంపులకు బాధితులను సిద్ధం చేయాలని సూచించారు. జ్వరాలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని వివరాలు అడిగి పర్యవేక్షించాలని చెప్పారు. ఇవికాక ఇతరత్రా వ్యాధులతో బాధపడుతున్నవారి వివరాలను సేకరించి వారికి ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సురక్ష పథకాన్ని వర్తింపచేయాలని కోరారు. ఈ పథకం ప్రాధాన్యాన్ని వారికి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అలుగు మృతి



మరణించిన అలుగు

సాలూరు: అంతరించిపోతున్న వన్యప్రాణుల్లో ప్రధాన జాబితాలో ఒకటైన అలుగు మండలంలో రెండురోజుల క్రితం మృతిచెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మరిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ఓ ఇంట్లోకి అలుగు వచ్చింది. దాని మీద అవగాహన లేని కారణంగా ఏదో వన్యప్రాణి అని భావించి పట్టుకునే ప్రయత్నం చేయగా అప్పటికే అది మరణించింది. వెంటనే విషయాన్ని గ్రామస్తులు అటవీశాఖ అధికారులు తెలపగా వారు వచ్చి దానిని అలుగుగా నిర్ధారించి దహనం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు అడవిలో నుంచి సువర్ణముఖి నదిలో కొట్టుకు వచ్చి సమీప మరిపల్లి గ్రామానికి అలుగు వచ్చి ఉండవచ్చని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. వచ్చే నెల 1 నుంచి వన్యప్రాణుల వారోత్సవాలు నిర్వహిస్తూ ,ప్రజలకు వన్యప్రాణులపై అవగాహన పెంపొందించనున్నట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పార్వతి

సాలూరు: మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పార్వతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి రెగ్యులర్ ఎంపీడీఓ రమాదేవి సుదీర్ఘ సెలవుపై వెళ్లిన నేపథ్యంలో పార్వతి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆమె సాలూరు, పాచిపెంట ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహించారు.

అక్టోబర్ 3లోగా ఫీజు చెల్లించాలి



పోస్టర్‌ను విడుదల చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్

పార్వతీపురంటౌన్: ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులు అక్టోబర్ 3వ తేదీలోగా ఫీజు చెల్లించాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె. రామారావు అన్నారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం జూనియర్ కళాశాల ఆడిటోరియంలో జిల్లాలోని ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం దీనికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022–23 విద్యాసంవత్సరంలో ఫెయిల్ అయిన విద్యార్థులందరూ ఫైన్ లేకుండా ఆయా కళాశాలల్లో ఎగ్జామ్ ఫీజు చెల్లించడానికి అక్టోబర్ 3వ తేదీ వరకు సమయం ఉందని విద్యార్థులందరూ సంబంధిత కళాశాలలకు వెళ్లి ఫీజు చెల్లించేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ వై.నాగేశ్వరరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీగణపతి హోమం



తట్టికోటవీధిలో నిర్వహిస్తున్న లక్ష్మీగణపతి హోమం

సాలూరు: పట్టణంలోని తట్టికోటవీధిలో వినాయక ఉత్సవాల 20వ వార్షికోత్సవం నేపథ్యంలో బుధవారం లక్ష్మీగణపతిహోమం, వసంత పూజ నిర్వహించారు. స్థానిక కమిటీ సభ్యులు, యూత్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానికంగా ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది.

ప్రజారోగ్యంలో పారిశుద్ధ్య కార్మికులది కీలక భూమిక



పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

సాలూరు: ప్రజారోగ్యం విషయంలో పారిశుద్ధ్య కార్మికులదే కీలక భూమిక అని మున్సిపల్ కమిషనర్ జయరాం అన్నారు. ఈ మేరకు స్వచ్ఛభారత్ అభియాన్‌లో యూత్ వెర్సెస్ గార్బేజ్ 2.0లో భాగంగా మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులైన సామాలమ్మ, ఎరకలమ్మలను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ, పారిశుద్ధ్య కార్మికులు మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచడానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని ప్రశంసించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండడం వల్ల వ్యాధులు ప్రబలకుండా ప్రజలు ఆరోగ్యకరంగా ఉంటారని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఫకీర్ రాజు,మున్సిపల్ కార్యాలయ ఉద్యోగులు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలి

- డీఈఓ ఎస్.ప్రేమ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ ఎస్. ప్రేమ్‌కుమార్

పార్వతీపురంటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా బాధ్యతగా అంకిత భావంతో పనిచేయాలని, విద్యార్థులకు పాఠ్యాంశాలు ప్రణాళికా బద్ధంగా బోధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్ కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులంతా తరగతి గదిలో అనుసరించాల్సిన బోధనా పద్ధతులను, బోధనోపకరణాలను తయారు చేసుకుని ప్రదర్శనగా ఉంచాలని సూచించారు. నూతన బోధనా పద్ధతులను మెరుగు పరుచుకోవడానికి సమావేశాలు ఉపయోగపడతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహుళ పంటల ద్వారా జీవవైవిధ్యం పరిరక్షణ



జిగురు అట్టలతో ఏఓ కె.తిరుపతిరావు

పాచిపెంట: బహుళ పంటల ద్వారా జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవచ్చని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని విశ్వనాథపురం, పాంచాలి, రాయి గుడ్డి వలస, గ్రామాలలో అమలవుతున్న అంతర పంటలు, ప్రకృతి సేద్య పద్ధతులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ఉచితంగా అందించిన కంది, కూరగాయల విత్తనాలను పత్తిలో అంతర పంటలుగా, కంచె పంటలుగా పొలం గట్లపై వేసుకోవడం ద్వారా మిత్ర పురుగులను ఆకర్షించి శత్రువులను అరికట్టడమే కాకుండా అదనపు ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. అనంతరం విశ్వనాథపురంలో ప్రయోగాత్మకంగా జంటసాలు పద్ధతిలో సాగు చేస్తున్న రైతు తిర్లంగి ధనుంజయ వరి పంటను పరిశీలించారు. పత్తి, వరి పంటలో దోమపోటు నివారణకు ఉపయోగపడే జిగురు అట్టలను ప్రకృతి సేద్య బృందం ద్వారా ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్పీ తిరుపతినాయుడు, ఐసీఆర్పీ విజయ్, ఏఈఓ హైమ, వీఏఏ మోహన్, రైతులు పాల్గొన్నారు.

జేఏఎస్ సర్వే శతశాతం పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేఏఎస్ ప్రత్యేకాధికారి డా.టి.రమేష్

పార్వతీపురంటౌన్:

జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) శిబిరాల నిర్వహణకు ముందుగానే ఇంటింటి ఆరోగ్య సర్వే శతశాతం పూర్తి చేయాలని జేఏఎస్ ప్రత్యేక అధికారి డాక్టర్ టి.రమేష్ ఆదేశించారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ డాక్టర్ బి. జగన్నాథరావు ఆధ్వర్యంలో ప్రోగ్రాం అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఏఎస్ సర్వే త్వరితగతిన పూర్తి చేసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని కోరారు. ఆరోగ్య శ్రీ లబ్ధిదారులను గుర్తించి నివేదికలను సిద్ధం చేయాలని సూచించారు. జేఏఎస్ శిబిరాలకు నిర్దేశించిన నివేదికలను ముందుగానే సందర్శించి సంబంధిత శాఖాధికారులతో సమన్వయం చేసుకుని అక్కడ ఏర్పాట్లుపై చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జేఏఎస్ కార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు , జిల్లా కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి కె. సుకుమార్, డీఐఓ టి.జగన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు కె.విజయపార్వతి, టి. శివకుమార్, ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్‌కుమార్, నగేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇప్పటినుంచే వచ్చే ఏడాదికి ప్రణాళికలు



మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ

సీతానగరం: మండలంలో వలసల నివారణకు ఉపాధిహామీ పథకం ద్వారా అర్హులైన వారందరికీ ఉపాధి కల్పించడానికి అవసరమైన పనులు ఇప్పటి నుంచే గుర్తించాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ(సాలూరు) జి. శ్రీహరి కోరారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అధ్యక్షతన మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఉపాధిపనుల కల్పనకు ప్రణాళికలు తయారు చేసేందుకు ఏపీఓ భాను, ఎన్‌ఆర్ ఈజీఎస్ జేఈ కృష్ణ, టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏపీడీ జి.శ్రీహరి మాట్లాడుతూ మండలంలో ఇంతవరకూ జరిగిన ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. మండలంలో అర్హులైన వారందరికీ ఉపాధి హామీ పనులు కల్పించడంతో వలసలు నివారించగలిగామని చెప్పారు. ఇంకెవరికైనా ఉపాధి పనులు కావాలని కోరితే వారికి జాబ్‌కార్డులు సమకూరుస్తామని తెలిపారు. అర్హులైన వారందరికీ ఉపాధి పనులు కల్పించడానికి ముందుగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో పనుల మంజూరు కోసం ప్రణాళికలు తయారు చేయడం, క్షేత్ర స్థాయిలో గ్రామ సభలు నిర్వహించి అందులో ప్రజాభిప్రాయం తీసుకుని పనుల రూపకల్పన చేయాలన్నారు. ఏపీఓ, జేఈ టెక్నికల్ సహాయకులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్ర సహాయకులు ప్రజలకు తెలియజేయాలని, అందరికీ ఉపాధి పనులు కల్పించడానికి ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాట్ల పరిశీలన



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

సీతానగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను పరిసర గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు మండలంలోని బూర్జ ఉన్నత పాఠశాలలో ఈ నెల 30న నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాట్లను ఎంపీడీఓతో పాటు వైద్యాధికార సిబ్బంది బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ బూర్జ సచివాలయం పరిధిలో ఉన్న బూర్జ, అవాలవలస గ్రామాలలో ఆరోగ్య పరమైన సమస్యలు ఎదుర్కొన్న వారందరికీ పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్ రాధాకాంత్, సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఉషారాణి తోపాటు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రి నుంచి ఇద్దరు వైద్యనిపుణుల పర్యవేక్షణలో ఉచితంగా 7 రకాల వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించడానికి అవసరమైన వనరులు సమకూర్చడానికి వైద్యాధికారుల సూచనల మేరకు స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో బూర్జ సర్పంచ్ జి.దాసు, ఎంపీటీసీజి.చిన్నంనాయుడు, పెదంకలాం పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ జి. సూర్యనారాయణ, వెల్‌నెస్ సెంటర్ సీహెచ్‌ఓ, ఏఎన్ఎంలు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలి



అగ్నిప్రమాదాల నివారణపై వివరిస్తున్న అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు

సాలూరు:

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు అన్నారు. ఈ మేరకు అగ్నిప్రమాదాల నివారణపై సాలూరు పట్టణంలోని గాంధీనగర్ సమీపంలో మెట్టువీధి వద్ద బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇళ్లలో ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్స్, నిర్లక్ష్యంగా ధూమపానం చేయడం తదితర కారణాలతో అగ్నిప్రమాదాలు ఏ విధంగా సంభవిస్తాయి? వాటిని ఎలా నివారించాలనే అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో .అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది సింహాచలం, సీతంనాయుడు, నాగరాజు, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.